క్లుప్తంగా

క్రిమినల్ కేసులు పరిష్కరించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ఈనెల 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ రాజీ పడిన క్రిమినల్ కేసులు ఎక్కువగా పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. శనివారం మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో పోలీసు అధికారులతో న్యాయమూర్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ అదాలత్‌లో రాజీ పడిన క్రిమినల్ కేసులు పరిష్కరించాలని, ఆ దిశ కక్షిదారులను ప్రోత్సహించాలన్నారు. కక్షిదారులకు కేసు రాజీ వల్ల ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



కరపలో పూజలు చేస్తున్న గణేష్ బాలభక్త బృందం, మహిళలు

కరప: స్థానిక కొత్తపేటవీధి పాతవినాయకుని గుడిసెంటర్‌లో శనివారం గణేశ్ బాలభక్త బృందం సభ్యులు గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు రాట ముహూర్తం చేశారు. ఏటా ఇక్కడ నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది నిర్వహించేందుకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూడా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం చేసి, వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద...



ఉత్సవాలకు రాటముహూర్తం చేస్తున్న రమణరాజు

బోట్‌క్లబ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జైగణేశ్ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో శనివారం 18వ గణపతి నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. నగర గణేశ్ ఉత్సవ గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ముహూర్త పూజలు చేశారు. గణేశ్ ఉత్సవాలను మంగళకరంగా నిర్వహించాలని ఆయన అన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఉత్సవ నిర్వాహకులు ఎన్.బాబు, నాయకులు బాబి మోహన్, బుజ్జి, గురునాథ్, రామిరెడ్డి, వీరబాబు, సుబ్రహ్మణ్యం, సూరిబాబు పాల్గొన్నారు.

పీవీఎస్ఎస్ రాజుకు సత్కారం



రాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పదవీ విరమణ చేసిన దేవాదాయశాఖ ఈఓ పీవీఎస్ఎస్ రాజు దంపతులను శనివారం ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ మారెళ్ల శివ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు ఆధ్వర్యంలో వారికి సత్కరించారు. ముందుగా ఈఓ దంపతుల పేరు మీద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, ఆ శాఖ సిబ్బంది సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. దేవదాయశాఖ గుమాస్తా కే రఘు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి శ్రీనివాస్, మీసాల చక్రం తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ సిబ్బంది నిరసన



రమణయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ కమర్షియల్ ట్యాక్స్ సిబ్బంది శనివారం రమణయ్యపేటలోని కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీటీ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అనిశెట్టి వీవీ సత్యనారాయణస్వామి మాట్లాడుతూ 2.0 రీ ఆర్గనైజేషన్ పేరుతో జరిగిన అన్యాయాలు, జీఎస్టీవోలకు సరైన వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, పూర్వపు బదిలీలన్నీ పునఃపరిశీలించాలని, సర్కిల్ వ్యవస్థను పూర్వపు స్థితికి తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు నారాయణమూర్తి, శ్రీను, రాజా, రమేష్, వెంకటేష్, భవాని, సోహైల్‌ఖాన్, అనిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.



కరపలో కురుస్తున్న వర్షం



కరపలోని ఎస్సీవీధిలో నిలిచిన వర్షపునీరు



కరపలో జలమయంగా మారిన మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లే రోడ్డు



కాకినాడ - పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం జంక్షన్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

వాన జోరు

- విస్తారంగా వర్షాలు
- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- స్తంభించిన జనజీవనం

కరప: అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జన జీవనం స్తంభించింది. గ్రామాల్లోని వీధులు, కాలనీలలో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో బురదమయమై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలకు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో డ్రైన్లు లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. మండలంలో నడకుదురు, కరప, వలసపాకల, గురజనాపల్లి గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లోని మెయిన్‌రోడ్లు, కాలనీలు, శివారు ప్రాంతాలు బురదమయంగా మారాయి. కరప, గురజనాపల్లి, గొర్రిపూడి తదితర గ్రామాల్లోని హైస్కూల్ గ్రౌండ్‌లలో నీరు నిలిచిపోయి చిత్తడిగా మారింది. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు జలమయమవుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరపలోని మండల విద్యావనరులకేంద్రం, పోలీసుస్టేషన్, మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద నీరు నిలిచిపోయింది. ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యారు.

జోరుగా వర్షం

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడడంతో శనివారం రోజంతా వర్షం పడింది. కుండపోతగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు, శివారు కాలనీలు జలమయమయ్యాయి. వర్షం కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించిండంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ రూరల్‌లో పలు ప్రాంతాలలో వర్షపు నీరు నిలచిపోయింది. సర్పవరం జంక్షన్ నుంచి పిఠాపురం వెళ్లే మార్గంలో రాయుడు పాలెం జంక్షన్ వద్ద, అచ్చంపేట జంక్షన్లలో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఏడీబీ రోడ్డులో వంతెన నిర్మాణ పనులు చేపడుతుండడంతో అక్కడ బురద కారణంగా వాహనదారులు అవస్థలు పడ్డారు. రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్‌తో పాటు పలు చోట్ల నీరు రోడ్లపై నిలిచిపోయింది. వర్షం నీరు కారణంగా వరిచేలకు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురవుతున్నారు.

సముద్రం అల్లకల్లోలం

కాకినాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలమైన వాయుగుండంగా మారడంతో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు క్షేమంగా ఒడ్డుకు చేరుకుంటున్నారు. జిల్లాలో తీర ప్రాంత మండలాలల్లోని పలు గ్రామాల్లో మత్స్య శాఖ అధికారులు పర్యటించి, వేట వెళ్ల వద్దని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని, వేటకు వెళ్లడం సురక్షితం కాదని తెలియజేయజేశారు. రెండు సముద్రంలో చేపల వేటలో ఉన్న నాలుగు బోట్లు చైన్నై తీరంలోను, కొన్ని బోట్లు మచిలీపట్నం, వైజాగ్ వద్ద క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నట్టు మత్స్యశాఖ జేడీ కరుణాకర్ తెలియజేశారు. కాకినాడకు చెందిన సుమారు 15 బోట్లు సముద్రంలో తీరానికి దగ్గరలో ఉన్నాయని, ఫోన్ సిగ్నల్ ఉన్న మత్స్యకారులతో మాట్లాడి ఒడ్డుకు చేరుకోవాలని హెచ్చరించినట్టు జేడీ తెలిపారు. కాకినాడ కుంభాభిషేకం, హార్బన్‌పేట, ఉప్పాడ తదితర ప్రాంతాలలో మత్స్యశాఖ ఎఫ్‌డీఓలు, ఫిషరీస్ అసిస్టెంట్లు తుఫాన్ ప్రభావం గురించి వివరించారు.



కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వాననీరు

ఆందోళనలో అన్నదాతలు

కాకినాడ సిటీ: ఈ ఏడాది జూన్, జులైలలో కురిసిన వర్షాలకు రైతుల నారుమళ్లు, ఊడ్చిని పంట పొలాలు, వెదసాగు చేపట్టిన పొలాలు వర్షపు నీటిలో నిండిపోయి పంట దెబ్బతిన్నాయి. మళ్లీ రైతులు వరి నారును కొనుగోలు చేసి ఊడ్చారు. ఇప్పుడు కొద్దికొద్దిగా మొనలు తిరుగు ఉండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి రైతులు నాట్లు వేసేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వరి నాట్లు ఆలస్యమయ్యాయని చెబుతున్నారు. ఈ సారీ పంట ముంపుబారిన పడితే రైతులకు కోలుకోలేని దెబ్బ తగులుతుందన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు



కరపలో పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న రాజు

కరప: స్థానిక గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుని కుటుంబానికి శనివారం మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసరాలు, 25 కిలోల బియ్యం అందజేసింది. కరప గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మేడిశెట్టి మల్లేశ్వరరావు అనారోగ్య కారణాలతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మల్లేశ్వరరావు కుటుంబ పరిస్థితిని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురజనాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జొన్నలగడ్డ రాజుకు తెలుపగా, ఆయన కరప వచ్చి బాధిత కుటుంబానిక బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు.

దాడి కేసు నిందితుడికి 14 రోజుల రిమాండ్

కరప: వృద్ధురాలిపై దాడి చేసిన కేసులో నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్టు కరప ఏఎస్సై జి.ప్రసన్నకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం వేళంగి ఒంటరిగా ఉన్న వృద్ధురాలు(85)పై అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ తాగిన మత్తులో దాడికి పాల్పడిన విషయం పాఠకులకు విదితమే. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు కరప ఇన్‌చార్జి ఎస్సై కె.రామారావు తెలిపారు. విచారణలో భాగంగా నిందితుడిని వేళంగి శివారున అదుపులోకి తీసుకుని, శనివారం కాకినాడలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో పరచామన్నారు. నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించగా కాకినాడ సబ్‌జైలుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



అప్పారావు దంపతులను సత్కరించిన రామలక్ష్మి తదితరులు

కాకినాడ లీగల్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ శనివారం పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న కోన అప్పారావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ మాట్లాడుతూ అప్పారావు 42 సంవత్సరాలు సబార్డినేట్‌గా విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడమే కాకుండా ఆఫీసు కార్యకలాపాలను కూడా ఎంతో చక్కగా నిర్వహించారన్నారు. కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 టి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అప్పారావు రిజిస్ట్రేషన్ శాఖలో ఎటువంటి ఆరోపణలు లేకుండా ప్రతి అంశంపై అవగాహన ఉండడంతో ఏ పని అయినా చక్కగా నిర్వర్తించేవారన్నారు. సన్మాన గ్రహీత అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ఐజీ కార్యాలయంలో 1981లో సబార్డినేట్‌గా జాయిన్ అయ్యాను. అనంతరం డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పాటు సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయంలో విధి నిర్వహణలో మంచి గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పారావు దంపతులను కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్, కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్1-2 టి.ప్రసాదరెడ్డి, రమ్యశ్రీ, రిజిస్ట్రేషన్ శాఖ, ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

పదోన్నతి రోజే ఉద్యోగ విరమణ

ఏపీఎస్పీలో సోమశేఖరరావుకు ఘన వీడ్కోలు

కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యలు చేపట్టిన పిట్టా సోమశేఖరరావు ఒక్క రోజులోనే పదవీ విరమణ పొందారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీగా రాజమండ్రిలో పని చేసిన సోమశేఖరరావు శుక్రవారం ఎస్పీగా పదోన్నతి పొందారు. ఆయనకు కాకినాడ ఏపీఎస్పీ కమాండెంట్‌గా పోస్టింగ్ ఇవ్వడంతో శుక్రవారం రాత్రి ఆలస్యంగా బాధ్యతలు చేపట్టారు. ఒక్క రోజు పూర్తిగా గడవక ముందే పదవీ విరమణ పొందారు. తన బాధ్యతలను కొత్తగా నియమితులైన శామ్యూల్ జాన్‌కు శనివారం సాయంత్రం అప్పగించారు. అనంతరం ఏపీఎస్పీలో సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సోమశేఖరరావు, రాజకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. సోమశేఖరరావు మాట్లాడుతూ ఎస్సైగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన తాను ఎస్పీ హోదాలో కాకినాడకు తలమానికమైన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీస్ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పదవీ విరమణ పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.



సోమశేఖరరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

నిరుపేదలకు అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో 400 మందికి అన్నదానం నిర్వహించారు. హోరున వర్షం పడుతున్నా నిరుపేదల కోసం భోజనం ఏర్పాటు చేసినట్లు సంఘం చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సభ్యులు సత్తిబాబు, జవరెడ్డి సుబ్బారావు, కరప తాతీలు, కృష్ణవేణి, వర్ధిని, పాల్గొన్నారు.

ఆర్డీగా నాగ నరసింహారావు



కాకినాడ: పురపరి పాలనా శాఖ రీజినల్ డైరెక్టర్‌గా కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా ఆయనను ఆర్డీగా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడీసీ నాగనరసింహారావు స్థానంలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న కేటీ సుధాకర్‌ను కాకినాడ అదనపు కమిషనర్‌గా నియమించారు. ఒకటి రెండు రోజుల్లో వారూ బాధ్యతలు స్వీకరించినన్నారు.

అభ్యుదయ కవి ఆరుద్ర జయంతి

కాకినాడ రూరల్: అభ్యుదయ కవి ఆరుద్ర జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర చిత్రపటానికి విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925ఆగస్టు 31న విశాఖలో ఆరుద్ర జన్మించారని పేర్కొన్నారు. సినీ సాహిత్యంలో ఆయన రాసిన పాటలు అద్భుతమన్నారు.

బాధ్యతలే తియ్యని జ్ఞాపకాలు

- సమాచారశాఖ డీడీ నాగార్జున

కాకినాడ సిటీ: ఉద్యోగిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన కాలంలోనే అవి తీయటి జ్ఞాపకాలుగా మారి వారికి ఎంతగానో గుర్తు చేస్తాయని సమాచారశాఖ డీడీ డి.నాగార్జున అన్నారు. శనివారం కాకినాడ సమాచార శాఖ డీడీ కార్యాలయంలో టైపిస్టు జి.స్వరాజ్యకుమారి పదవీ విరమణ సందర్భంగా ఆమెకు నిర్వహించిన అభినందన సభకు నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వరాజ్యకుమారి ప్రతి విషయాన్ని ఎంతో శ్రద్ధగా ఓపిగ్గా విని తన బాధ్యతలను సకాలంలో నిర్వహించేవారన్నారు. ఆమె శేష జీవితం ఎంతో ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు. సన్మానగ్రహీత స్వరాజ్యకుమారి మాట్లాడుతూ తనకు కార్యాలయంలో సహకరించిన సిబ్బంది మేలు మరువలేనన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పదవీవిరమణ చేసిన స్వరాజ్యకుమారిని సమాచారశాఖ సిబ్బంది, బంధువులు పూలమాలు వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ జి.విజయరాజు, డివిజనల్ పీఆర్వో పెద్దింటి రవి, సమాచార శాఖ సిబ్బంది సీహెచ్ బాబూరావు, పద్మజ, బషీర్, గోపి, లక్ష్మి, నరేష్, అజయ్, సతీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



స్వరాజ్యకుమారిని సత్కరిస్తున్న ఆ శాఖ ఉద్యోగులు

కరప మండలంలో 92.89 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలో శనివారం సాయంత్రానికి 92.4 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పింఛనుదారులు 11,497 మంది ఉండగా, రూ.4,80,89,500 ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో 10,680 మంది లబ్ధిదారులకు రూ 4,47,15,500 గ్రామ కార్యదర్శులు గ్రామ సచివాలయం సిబ్బంది, వీఆర్వోలు, ఏఎన్ఎంలు తదితర ప్రభుత్వోద్యోగులు లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను ఇచ్చారన్నారు. పెనుగుదురు-1 గ్రామ సచివాలయం 95.85 శాతం, వాకాడ, గొర్రిపూడి-1 సచివాలయాలు 95.7 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు. ఈఓపీ ఆర్డీ బీఏ సత్యనారాయణ, గ్రామకార్యదర్శుల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను సొమ్ము అందజేశారన్నారు. ఇంకా ఇవ్వాల్సిన వారికి సోమవారం అందజేస్తామని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు. వివిధ గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నులికుర్తి వెంకటేశ్వరరావు, పిల్లి సత్యనారాయణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుగుదురులో పింఛను పంపిణీని పరిశీలిస్తున్న సిబ్బంది

షూటింగ్ చాంపియన్ షిప్‌లో విద్యార్థి ప్రతిభ



బంగారు పతకం సాధించిన శ్రీసూర్య ప్రణవ్

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని గంగరాజునగర్ ఆదిత్య ఐబిటీ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి గాదం శ్రీసూర్య ప్రణవ్ 24వ ఏపీ స్టేట్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రణవ్ శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆ పతకాన్ని అందుకున్నాడు. చాంపియన్ షిప్ పోటీలో ప్రతిభ చూపిన ప్రణవ్ సౌత్ జోన్, ప్రీ నేషనల్స్‌కు ఎంపికైనట్టు కోచ్ సర్పవరం చాంపియన్ షూటింగ్ అకాడమీకి చెందిన పోట్నూరి శంకర్ తెలిపారు.

వసతి గృహం పరిశీలన



విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న నాలుగో అదనపు జిల్లా జడ్జి హరినారాయణ

కాకినాడ లీగల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఆనంద నిలయం వసతి గృహాల్లో విద్యార్థులను కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ పరిశీలించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, సదపాయాలను అడిగి తెలుసుకున్నారు.

పర్యావరణ హితం.. మట్టి విగ్రహం

- మట్టి గణపయ్యను పూజిద్దాం
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉందాం
- పర్యావరణ వేత్తల ప్రచారం

కాకినాడ సిటీ: గణపయ్యతత్వం పృథ్వీమయం. అందుకే పృథ్విలో దొరికే మట్టితో చేసే గణపయ్యనే పూజించాలని వేద పండితులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలనే పూజించాలంటూ పర్యావరణ వేత్తలు చైతన్యం కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలను పూజించి భూమి, జల వనరులను కాపాడాదామని ఏటా వినాయక చవితికి నెల రోజుల ముందు నుంచే ప్రచారం జరుగుతుంది. అయినా చవితి రోజు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు ప్రత్యక్షమవుతుంటాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పూర్తిగా కనుమరుగయ్యే వరకూ మట్టి గణపయ్యను పూజించేలా అవగాహన కల్పించేందుకు ఈ కథనం.

వినాయక చవితి రోజున మట్టి వినాయకుడి మాత్రమే వినియోగించాలి. పూర్వకాలం నుంచి కూడా మట్టి గణపతినే పూజించేవారు. అయితే కాలానుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడుకలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని ఇటు పండితులు, అటు పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాలంటే వినాయకుడి తత్వం పృథ్వీమయం అని పూరాణాల్లో ఉంది. పృథ్వీ అంటే భూమి, భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహం ఎక్కవ కాలం ఉండదు కాబట్టే నిమజ్జనం చేయాలని చెప్పారు. గతంలోనూ మట్టి ప్రతిమలతోనే గణనాథులు పూజలందుకున్నారు. అందుకే మనం మట్టి వినాయకుడిని పెట్టి పూజించాలి.



వినాయక మట్టి విగ్రహాలు

మట్టితో లాభాలు

- సహజసిద్ధంగా దొరకే బంక మట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచింది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది.
- మట్టి విగ్రహాల నిమజ్జంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- సహజంగా చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియమ్, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్, కార్బన్ అవశేషాలుంటాయి.
- ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూసి క్యాన్సర్ వ్యాధికి దారి తీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.
- ప్లాస్టర్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్ల పడుతుంది. నీరు, నేల,గాలిపై కాలుష్య ప్రభావం ఉంటుంది.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను కాకుండా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో అధికంగా స్వచ్ఛంద సంస్థలు అందరికీ మట్టి విగ్రహాలను అందజేస్తారు. మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం.

– దూసర్లపూడి రమణరాజు, గణేశ్ ఉత్సవాల సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు, కాకినాడ

మట్టి విగ్రహాలే శ్రేష్టం



మట్టి విగ్రహాలే పూజకు శ్రేష్టం. రసాయనాలతో తయారు చేసే పీవోపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం ఆ నీటిని పశువులు తాగితే వ్యాధులబారిన పడతాయి. అటువంటి విగ్రహాలను పక్కన పెట్టి మట్టి విగ్రహాలను వాడడం వల్ల మానవాళికి కూడా ముప్పువాటిల్లకుండా ఉంటుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడుకోవాలి.

– కక్కల శ్రీదుర్గ, ఎఎస్ఆర్ కాలనీ, తూరంగి

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో రసాయనాలతో తయారు చేసే విగ్రహాలనే వాడుతున్నారు. ముఖ్యంగా అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే ఇలా జరుగుతుంది. గ్రామాల్లో అందరికీ మట్టి విగ్రహాల వల్ల కలిగే లాభాలు. పీఓపీ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తే కాస్త మార్పు వస్తుంది. అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు.

– రంబాల వెంకటేశ్వరరావు, రమణయ్యపేట, కాకినాడ